జనసేన జనవాణిలో అర్జీల స్వీకరణ

అమరావతి, ఆంధ్రప్రభ: జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం మంగళగిరిలో శుక్రవారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారు తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. అత్యవసర సమస్యలను సబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. మిగతా సమస్యలను సంబంధిత శాఖలకు పంపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఘంటసాల వెంకటలక్ష్మి, మండలి రాజేష్, లీగల్ టీమ్ సభ్యులు బయ్యవరపు నరసింహరావు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్ స్క్రీనింగ్ టెస్ట్ వాయిదా

అమరావతి, ఆంధ్రప్రభ: సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం నిర్వహించనున్న స్క్రీనింగ్ టెస్ట్ వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి రావడంతో ఈనెల 10న జరగాల్సిన పరీక్ష వాయిదా పడిందన్నారు. ఈ టెస్ట్ ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని చెప్పారు. దరఖాస్తుదారులు సహకరించాలని కోరారు. అయితే పరీక్ష నిర్వహణకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. చివరి క్షణంలో పరీక్ష వాయిదా పడడంతో శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నిరుత్సాహానికి గురయ్యారు. డీఎస్సీ ప్రకటన కూడా మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

ధర్మగిరిలో టీటీడీ చైర్మన్ పర్యటన

వేద విజ్ఞానపీఠం, ఎస్వీ గోశాలను సందర్శించిన బీఆర్ నాయుడు

తిరుమల, ఆంధ్రప్రభ ప్రతినిధి: తిరుమలలోని ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం, ఎస్వీ గోశాలను శుక్రవారం సాయంత్రం టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు సందర్శించారు. ధర్మగిరికి తొలిసారిగా వచ్చిన సందర్భంగా ప్రిన్సిపాల్ కెఎస్ఎస్ అవధాని టీటీడీ చైర్మన్‌కు వేద మంత్రోచ్చారణలు నడుమ వేదాశీర్వచనం నిర్వహించి సంప్రదాయ పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులందరూ తమ కోర్సులలో నైపుణ్యం సాధించి సనాతన ధర్మాన్ని ప్రబోధించాలని కోరారు. ఏదైనా సమస్యలను తాము పరిష్కరిస్తామని, మరోసారి విద్యార్థులందరినీ కలుస్తానన్నారు. సనాతన ధర్మాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్ళాలన్నదే తమ ఉదాత్తమైన సంకల్పమని ఆయన పేర్కొన్నారు. తొలుత ధర్మగిరి ప్రధానోపాధ్యాయులు తిరుమలలో వైదిక సంస్థ ఆవిర్భావం, ప్రాభవం గురించి టీటీడీ చైర్మన్‌కి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ధర్మగిరి విజయలక్ష్మి, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మధుసూదన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలోని గోశాలను సందర్శించిన చైర్మన్

టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు గోశాలను సందర్శించి నవనీత సేవలో పాల్గొన్నారు. నవనీత సేవలో శ్రీవారి సేవకులు చేస్తున్న సేవలను ఆయన పరిశీలించారు. ఏకాంత సేవకు వినియోగించే వెన్నను తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం గోపూజలో చైర్మన్ బీఆర్ నాయుడు, ఎస్వీ గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథ్ రెడ్డిలు పాల్గొన్నారు.

పెద్ద జీయర్ మఠం సందర్శన

శ్రీ పెద్ద జీయర్ మఠాన్ని టీటీడీ చైర్మన్ సందర్శించి, శ్రీ పెద్ద జీయర్ స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం అఖిలాండంలో శ్రీ బడి ఆంజనేయ స్వామికి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు.

తిరుమలలో అదనపు ఈవో తనిఖీలు

తిరుమల, ఆంధ్రప్రభ ప్రతినిధి: టీటీడీ అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి నారాయణగిరి షెడ్లను శుక్రవారం వేకువజామున ఆకస్మిక తనిఖీ చేశారు. యాత్రికులకు భోజన, పాలు సకాలంలో అందుతున్నాయా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. శ్రీవారి సేవకులు భక్తులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. చలికాలం కావడంతో వేడి పాలు నిరంతరాయంగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. తగిన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేటట్లుగా చూడాలన్నారు. వైకుంఠ క్యూ కాంప్లెక్స్-2లో వేచి ఉన్న భక్తులకు వీలైనంత త్వరగా దర్శనం చేయిండానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సాయంత్రం తిరుమలలో నూతనంగా నిర్మిస్తున్న యాత్రికుల వసతి సముదాయం-5 భవనాన్ని టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తనిఖీ చేశారు. భవనంలో ఏర్పాటు చేస్తున్న కల్యాణ కట్ట, భోజనశాల, మరుగుదొడ్లు, విద్యుత్ వైరింగ్, హాళ్లను పరిశీలించారు. ఈ ఏడాది చివరిలోపు పనులను పూర్తి చేసి జనవరి నెలలోపు భవనాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు ఆలస్యం కాకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీటీడీ సభ్యులుగా మరో ఐదుగురు ప్రమాణ స్వీకారం



తిరుమల, ఆంధ్రప్రభ ప్రతినిధి: టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా శుక్రవారం ఉదయం వి.కృష్ణమూర్తి, సౌరభ్ బోరా, పనబాక లక్ష్మి, సదాశివరావు, జ్యోతుల నెహ్రూలు ప్రమాణస్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి చెంత టీటీడీ అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం వారికి శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అడిషనల్ ఈవో అందజేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు లోకనాథం, భాస్కర్, వీజీవోలు సురేంద్ర, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం రూటులో 108

- ఈ నెల 6న ఒక్కరోజే 1,521 కాల్స్‌కు అటెండ్ కాలేదు
- అందులో 251 రోడ్డు ప్రమాద ఘటనలు
- సకాలంలో వైద్యసేవలు అందక ఆర్తనాదాలు చేసిన బాధితులు
- 169 వాహనాలకు జీపీఎస్ తొలగించి తిరగని ట్రిప్పులకు దొంగబిల్లులు
- నిబంధనలకు విరుద్ధంగా సొంత గ్యారేజ్ నిర్వహణ
- అరబిందో సంస్థపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్
- త్వరలోనే ఉద్వాసన పలకాలనే యోచనలో సీఎం చంద్రబాబు
- అడిషనల్ సీఈవో విచారణలో వెలుగు చూస్తున్న అక్రమాలు

అమరావతి, ఆంధ్రప్రభ: కుయ్..కుయ్..మంటూ ఆపదలో ఉన్న వాళ్ళ ప్రాణాలను కాపాడాల్సిన 108 సేవల్లో నిలువెత్తు నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ప్రాణాపాయంలో ఉండి ఆదుకోమని ఫోన్‌కాల్ చేసినా సంఘటనా స్థలానికి రావడం లేదని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఈనెల 6 తేదీ ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి వచ్చిన 1,521 ఫోన్‌కాల్స్‌కు 108 వాహనాలు స్పందించలేదు. ఇందులో 251 రోడ్డు ప్రమాదాల బాధితులున్నారు. ఎంత సేపటికీ 108 వాహనాలు రాకపోవడంతో రోడ్డు ప్రమాద బాధితులు ఆర్తనాదాలు చేశారు. ఇది ఒక్కరోజు మాత్రమే అనుకుంటే పొరపాటే గడిచిన రెండు నెలలుగా ఇంచుమించు ఇదే పరిస్థితి నెలకొందని క్షేత్రస్థాయి నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. పరిస్థితి ఇంత అధ్వాన్నంగా మారడంతో రాష్ట్ర ప్రభుత్వం 108 సేవలపై ప్రత్యేక దృష్టిసారించింది. అరబిందో సంస్థ సేవలపై సీఎం చంద్రబాబు సీరియస్‌గా ఉన్నారు. రెండు, మూడు నెలల్లో 108 సేవల బాధ్యతల నుంచి అరబిందోకు సెలవు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. 108 సేవల్ని గాడిలో పెట్టడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తాజా పరిణామాల నేపథ్యంలో అరబిందో సంస్థ నిర్లక్ష్యం, అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి.

అంతా వాళ్లిష్టం

2014-19 కాలంలో 108 అంబులెన్స్ సేవల్ని జీవీకె సంస్థ నిర్వహించింది. ఆ తరువాత రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 2020లో అరబిందో సంస్థతో అగ్రిమెంట్ కుదుర్చుకుంది. ఏడేళ్ళ పాటు సేవలు అందించేలా ఎంఓయూ చేసుకున్నారు. దీని ప్రకారం 2027 జులై వరకు అరబిందో సంస్థ సేవలు అందించాల్సి ఉంటుంది. అరబిందో సంస్థకు కాంట్రాక్ట్ ఇవ్వడం వల్ల రాష్ట్రప్రభుత్వంపై అదనంగా రూ.800 కోట్లు భారం పడిందని సమాచారం. ప్రాణాపాయంలో ఉన్న వాళ్ళను సకాలంలో ఆస్పత్రులకు తరలించడంలో అరబిందో సంస్థ విఫలం అవుతోందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఒక్కో అంబులెన్స్ నిర్వహణకు నెలకు రూ.1.31 లక్షలు ఖర్చయితే అరబిందోకు రూ.1.78 లక్షల చొప్పున చెల్లించారు. కొత్త అంబులెన్స్‌లకు రూ.2.21 లక్షలకు పెంచారు. ఇంతా చేసి మెరుగైన సేవలు అందించిందా అంటే ట్రిప్పుల నమోదులోనూ అరబిందో మాయ చేసిందనే విమర్శలు బలంగా ఉన్నాయి. ఇక సొంత గ్యారేజ్ నిర్వహించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదైనా వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడు దాని సర్వీసు, మరమ్మతులు తదితరాలన్నింటికీ వాహనం కొనుగోలు చేసిన కంపెనీ ద్వారానే చేయాల్సి ఉన్నప్పటికీ అరబిందో సంస్థ మాత్రం సొంత గ్యారేజ్ నిర్వహించి బిల్లులు పెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది.

- రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల పరిధిలో 108 వాహనాలు 621 ఉండగా అందులో 452 వాహనాలకు మాత్రమే జీపీఎస్ అమర్చి ఉంది. మిగితా 169 వాహనాలకు జీపీఎస్‌ను పీకేశారు. అదేమంటే డ్రైవర్లు పీకేశారని అరబిందో నిర్వాహకులు చెబుతున్నారు. జీపీఎస్ లేని వాహనాలు క్షేత్రస్థాయిలో బాధితులకు సేవలు అందించనప్పటికీ, సేవలు చేసినట్లు రికార్డుల్లో చూపుతూ బిల్లులు చేసుకుంటున్నారనే అభియోగాలు ఉన్నాయి.
- రాష్ట్ర ప్రభుత్వంతో అరబిందో సంస్థ కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఒక్కో వాహనం నెలకు 120 ట్రిప్పులు తిరగాలని ఎంవోయూలో ఉంది. దీంతో మొదటి 20 రోజుల్లోనే ఆ ట్రిప్పుల్ని పూర్తి చేసి వాహనాలను పక్కన పెట్టేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. లేదంటే రోజుకు కేవలం 4 ఫోన్‌కాల్స్ మాత్రమే అటెండ్ అయి వాహనాలను ఆపేస్తున్నారని, అందుకే గత కొన్ని నెలలుగా ఫోన్‌కాల్స్‌కు 108 వాహనాలకు సకాలంలో స్పందించడం లేదనే టాక్ నడుస్తోంది.
- 108 సకాలంలో ప్రమాద స్థలికి రాకపోవడం వల్ల బాధితులు, వారి కుటుంబ సభ్యుల్లో 108 సేవలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే 108 సేవలు సకాలంలో అందడం లేదనే భావన ప్రజల్లో క్రమేపీ బలపడుతోంది. దీన్ని గుర్తించిన రాష్ట్రప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది.
- ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.141 కోట్ల మేర అరబిందో సంస్థకు బిల్లులు రావాల్సి ఉంది. దీనిపై ఇటీవలే ప్రభుత్వానికి ఆ సంస్థ నిర్వాహకులు లేఖ రాశారు. ఈనెల 5వ తేదీన వాహనాల్లో డీజెల్ కొట్టించేందుకు డబ్బులు లేవనే సాకుతో 108 ఎమర్జెన్సీ సర్వీసుల్ని సత్యసాయి జిల్లాలో 10 వాహనాలను పక్కన పెట్టేయడం వివాదాస్పదంగా మారింది.
- కొన్నిచోట్ల గోల్డెన్ అవర్‌లో బాధితులకు 108 అంబులెన్స్ ద్వారా సేవలు అందలేదు. సకాలంలో క్షతగాత్రుల వద్దకు 108 వెళ్ళలేదని గతంలోనే కాగ్ నివేదిక తప్పబట్టినప్పటికీ నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. 108, 104 సేవలు అందించేఉద్యోగులకు అరబిందో సంస్థ సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరబిందో సేవలు సక్రమంగా లేకపోవడంతో ఆసంస్థను తప్పించి కొత్త టెండర్లు పిలవాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

విచారణ చేస్తున్నాం

108 సేవల్లో అరబిందో సంస్థ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రికార్డుల్ని పరిశీలిస్తే అర్థమవుతోందని ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ అడిషనల్ సీఈఓ కె.అప్పారావు చెప్పారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రప్రభ'తో మాట్లాడుతూ, 169 వాహనాలకు జీపీఎస్ తొలగింపు, సొంత గ్యారేజ్ నిర్వహణపై విచారణ చేస్తున్నామన్నారు. ప్రాణాపాయంలో ఉన్నవారికి సకాలంలో 108 సేవలు అందకపోవడాన్ని ఉపేక్షించేది లేదన్నారు. 108 సేవల్ని మెరుగుపర్చేందుకు కసరత్తు చేస్తున్నాట్లు చెప్పారు. ఫోన్‌కాల్స్‌కు అటెండ్ కాని వాహనాలకు రూ.50 వేలు జరిమానా విధించే ఆలోచన చేస్తున్నామన్నారు.

పుణ్యక్షేత్రాలను ప్రత్యేక రాష్ట్రం చేయమంటారా?

- కేఏ పాల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- తిరుపతి పుణ్యక్షేత్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతం చేయాలనే డిమాండ్‌పై ఆగ్రహం
- పాల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసిన అత్యున్నత న్యాయస్థానం

న్యూ ఢిల్లీ, ఆంధ్రప్రభ బ్యూరో: దేశంలోని పవిత్ర ఆలయాలు ఉన్న కేధారినాథ్, పూరి, రామేశ్వరం, ఇతర పుణ్యక్షేత్రాలను ప్రత్యేక రాష్ట్రాలుగా చేయమంటారా? అని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. అలా చూస్తే... నాలుగు పవిత్ర ఆలయాలు ఉన్న మహారాష్ట్రను నాలుగు రాష్ట్రాలుగా చేయాల్సి వస్తుందని అభిప్రాయపడింది. హిందువులు పవిత్ర పుణ్య క్షేత్రంగా భావించే తిరుమల తిరుపతిని కేంద్ర పాలిత ప్రాంతం, టీటీడీకి స్వయం ప్రతిపత్తి హోదా కల్పించాలని ప్రజాశాంతి పార్టీ చీఫ్ కేఏ పాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ను శుక్రవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా కేఏ పాల్ స్వయంగా తన పిటిషన్‌పై వాదనలు వినిపించారు. 746 మంది కాథలిక్స్ కోసం వాటికన్ సిటీ ఏర్పాటు చేసిన ప్పుడు, 30 లక్షల మంది భక్తులు ఉన్న తిరుపతి సిటీని ఎందుకు కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పాటు చేయలేమన్నారు. ఇది ప్రాథమిక, మానవ హక్కుల ఉల్లంఘన అన్నారు. ఇందుకు సంబంధించి రాజ్యాంగంలోని 14, 21, 25, 26 ఆర్టికల్‌లను ఎత్తిచూపారు. క్రైస్తవులు, ముస్లింలు తమ మత స్థలాలపై (చర్చిలు, మసీదులపై) స్వయంప్రతిపత్తి కలిగి ఉన్నారని, అదే హక్కు హిందువులకు నిరాకరిం చబడుతుందని కోర్టుకు నివేదించారు. ఇది చట్టం ముందు సమానత్వ సూత్రాన్ని ఉల్లంఘిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. ఆలయాలను రాజకీయంగా వాడుతున్నారని కోర్టుకు తెలిపారు. అలాగే తిరుమల లడ్డూ వ్యవహారంపై అక్టోబర్ 3న సుప్రీంకోర్టు పలు ఆదేశాలు చేసిప్పటికీ... ఎలాంటి పురోగతి లేద ని కోర్టుకు తెలిపారు. త్వరితగతిన విచారణ, జవాబుదా రీతనం, సత్వర న్యాయం జరిగేలా కమిటీకి టైం బాండ్‌తో కూడిన ఆదేశా లు ఇవ్వాలని కోరారు. తిరుపతికి నిత్యం వచ్చే లక్షలాది మంది భక్తుల సమస్యల పరిష్కారానికి, విచారణను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. మత వర్గాల మధ్య విభేదాలు సృష్టించే రాజకీయ అవకతవకలు, జోక్యం గు రించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వాదనలపై స్పందించిన ధర్మాసనం... తాము నేరుగా ప్రత్యేక స్టేట్ ఏర్పాటు చేయమని కేంద్రాన్ని ఆదేశించ లేమన్నారు. ప్రత్యేక రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలపై పార్లమెంట్ లో సవరణలు జరుగుతాయని చెప్పారు. ఈ వాదనలు వింటుంటూ... భవిష్యత్ లో దేశంలోని అన్ని పుణ్య క్షేత్రాలు, గురుద్వారాలు, ఇతర మందిరాలను కేంద్ర పాలిత ప్రాంతాలు చేయమంటారు అని అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

వరదలను ఎదుర్కొనేందుకు శిక్షణ

విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్

అమరావతి, ఆంధ్రప్రభ: సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు భవిష్యత్‌లో వరదలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి క్షేత్రస్థాయిలో అధికారులకు అమలు చేయాల్సిన ప్రణాళికలపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు విపత్తుల నిర్వహణ సంస్థ సన్నద్ధమైందని ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఇటీవల సంభవించిన కృష్ణా నది బుడమేరు వరదల్లో క్షేత్రస్థాయిలో పనిచేసిన వారి అనుభవాలను పంచుకుంటూ, అవలంబించిన ఉత్తమ పద్ధతులు, సక్సెస్ స్టోరీస్ ఆధారంగా సంబంధిత శాఖల్లో పనిచేసే వారికి శిక్షణా కార్యక్రమాలు రూపొందించేందుకు లైన్ డిపార్టమెంట్ అధికారులతో విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్, లా అండ్ ఆర్డర్ ఏఐజీ సిద్ధార్థ్ కౌశల్ తో కలసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ శాఖలను మరింత పటిష్టం చేసేందుకు ట్రైనింగ్ మాడ్యూల్స్, విశ్లేషించాల్సిన అంశాలు, శాఖల వారీగా సాంకేతికత వినియోగం, ఇతర అంశాలపై శిక్షణా కార్యక్రమాలు రూపొందించేందుకు అధికారులతో ఎండీ రోణంకి కూర్మనాథ్ చర్చించారు. ఈ సమావేశంలో డీఐజీ (ఏపీఎస్పీ 3వ రేంజ్) సీతారామ్, ఎస్డీఎంఏ ఈడీ నాగరాజు, శాఖల ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

వివాహ చక్రబంధంలో బాల్యం బలి

- గుట్టుగా బాల్య వివాహాలు
- అడ్డదారిలో చిన్నారులకు వివాహాలు
- ఆధార్ ఫోర్జరీతో మేజర్లుగా చిత్రీకరణ
- నిస్తేజంగా అధికార యంత్రాంగం

అమరావతి, ఆంధ్రప్రభ: వివాహచక్రబంధంలో బాల్యం బలైపోతోంది. రాష్ట్రంలో ఇంకా కొన్ని జిల్లాల్లో బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. పల్లెల నుంచి నగరాల వరకు గుట్టుచప్పుడు కాకుండా బాల్య వివాహాలు జరిగిపోతున్నాయి. వీటిని అరికట్టాల్సిన అధికారులు నిస్తేజంగా మారడంతో బాల్యం బలైపో తోంది. తల్లిదండ్రులు విచక్షణ కోల్పోయి బంగారు భవిష్యత్తు ఉన్న చిన్నారులను పెళ్లి పీటలు ఎక్కించి బలి కోరుతున్న పరిస్థితి ఇంకా కొన్ని ప్రాంతాల్లో నెలకొంది. అనంతపురం, ఏలూరు జిల్లాల్లో మళ్ళీ బాల్య వివాహాల అంశం బయటప డింది. బాల్య వివాహాలను జరిపించేందుకు తల్లి తండ్రులు అడ్డదారిని ఎంచుకుంటున్నారు. తప్పుడు దారిలో మైనర్లను మేజర్లుగా చిత్రీకరిస్తూ అధికారులను బోల్తా కొట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఆధార్‌ను ఫోర్జరీ చేస్తూ వయస్సులో మార్పులు చేస్తూ చిన్నారులను పెళ్లి పీటలు ఎక్కిస్తున్నారు. ఇదే అంశాన్ని శాసన మండలిలో ఆనాడు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు సైతం ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసు కోకపోవడంతో ఆ తరువాత కూడా ఆ జిల్లా లో బాల్య వివాహాలు గుట్టుగా జరిగాయి. తాజాగా మళ్ళీ బాల్య వివా హాల తంతు బయట పడుతోంది. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం శ్రీహరిపురంలో ఓ బాలికకు ఆధార్ కార్డులో వయసు మార్చి బాల్యం వివాహం చేసే ప్రయత్నం చేశారు. బాలిక వయసు 13 సంవత్సరాలు కాగా ఆధార్‌లో 18 ఏళ్లు నిండినట్లు మార్చారు. అనంతరం 33 ఏళ్ల వ్యక్తితో పెళ్లి చేసేందుకు రంగం సిద్ధం చేశారు. గ్రామస్తుల ఫిర్యాదుతో అధికారులు వివాహాన్ని నిలిపివేశారు. అలాగే తణుకు రూరల్ పరిధిలో ఇటీవల 8వ తరగతి చదివే ఓ బాలికకు 31 ఏళ్ల వయసు ఉన్న మేన మామతో గుట్టుగా పెళ్లి చేశారు. బాలిక తల్లి దండ్రులకు ఆస్తులు, పొలాలు ఉండటంతో బయట వారికి ఇచ్చి పెళ్లి చేస్తే ఆస్తి పోతుందని ఇలా చేశారన్న ఆరోపణలు స్థానికం వెల్లువెత్తాయి. తాజాగా ఏలూరుపరిధిలో ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదివే ఇద్దరు బాలికలకు కొద్ది రోజుల క్రితమే వివాహాలు చేసేశారు. ఈ విషయం తెలిసినా పాఠశాల ప్రధానోపాధ్యాయిని అధికారులకు సమాచారం ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా అడ్డదారిలో చిన్నారులపెళ్ళిళ్ళు జరుగుతున్నా అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో దృష్టి సారించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. బాల్య వివాహాల నియంత్రణకు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, వీఆర్వో, మహిళా పోలీసు, ఏఎన్ఎం నెల వారీ సమావేశాలు నిర్వహించాలి.గ్రామంలో వివాహాలు జరుగు తున్నాయంటే కచ్చి తంగా అంగన్‌వాడీ కార్యకర్త, మహిళా పోలీసు, ఉపాధ్యా యులకు, కార్యదర్శికి తెలిసినా ఉన్నతాధి కారులకు సమా చారం ఇవ్వడం లేదు. ఇక ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే అధికారులు రంగంలోకి దిగుతున్నారు. 1098 టోల్ ఫ్రీ నంబర్‌కి ఫిర్యాదు వచ్చాకే అధికారులు స్పం దిస్తున్న పరిస్థితి నెలకొంది. అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, వీఆర్వోలు గ్రామ స్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నా బాల్య వివాహాల సమాచారం మాత్రం ఉన్నతాధికారులకు చేరడం లేదు. ఒకవేళ సమాచారం అందినా ఉన్నతాధికారులు వచ్చి బాల్య వివాహాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసినా తల్లితండ్రులు, వారి బంధువులు తప్పుడు ఆధార్‌లను చూపుతూ బురిడీ కొట్టిస్తున్నారు. ఇక పోలీసులు జోక్యం చేసుకున్న తరువాత మాత్రమే తప్పుడు ఆధార్ కార్డుల తంతు బయటపడు తోంది. ఇక లేని పక్షంలో ఆ చిన్నారి బాల్యం వివాహ బంధానికి బలైపోతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బాల్య వివా హాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సామాజిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆదిత్య స్పిన్నర్స్ లిమిటెడ్

సిఐఎన్ : ఎల్40300ఎపి1991పిఎల్‌సి012337
నమోదిత కార్యాలయం : పెరిందేశం గ్రామం, కె.వి.బి.పురం మండలం, శ్రీకాళహస్తి దగ్గర, చిత్తూరు జిల్లా, ఆం.ప్ర.,
ఇ-మెయిల్ : adityaspinnergrievenceredresal@gmail.com వెబ్‌సైట్ : www.adityaspinners.net

30 సెప్టెంబర్ 2024తో ముగిసిన త్రైమాసికం కొరకు స్టాండ్ అలోన్ ఆడిట్ చేయని ఫలితాల యొక్క సారాంశం

(రూ.లక్షలలో)

	వివరాలు	ముగిసిన మూడు నెలలు			సంవత్సరం నుండి తేదీకి		
		30/09/2024	30/06/2024	30/09/2023	30/09/2024	30/09/2023	31.3.2024తో ముగిసిన 12 నెలలు
		ఆడిట్ చేయనివి	ఆడిట్ చేయనివి	ఆడిట్ చేయనివి	ఆడిట్ చేయనివి	ఆడిట్ చేయనివి	ఆడిట్ చేసినవి
1	కార్యకలాపాల నుండి మొత్తం ఆదాయం (నికరం)	1540.39	1553.56	1565.01	3093.95	3185.94	6125.75
2	నికరలాభం / (నష్టం) కాలానికి (పన్ను, మినహాయింపదగిన మరియు అసాధారణ విటలకు ముందు)	(67.28)	(62.08)	(3.02)	(129.36)	25.49	186.67
3	నికరలాభం / (నష్టం) కాలానికి పన్నుకు ముందు (మినహాయింపదగిన మరియు అసాధారణ విటంల తరువాత)	(67.28)	(62.08)	(3.02)	(129.36)	25.49	186.67
4	నికరలాభం / (నష్టం) కాలానికి పన్నుకు తరువాత (మినహాయింపదగిన మరియు అసాధారణ విటంల తరువాత)	(64.19)	(59.00)	(0.97)	(123.19)	29.75	185.50
5	మొత్తం సమగ్ర ఆదాయం కాలానికి (కాలానికి (పన్ను తరువాత) లాభం / (నష్టం) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత) కలిగినది)	(64.19)	(59.00)	(0.97)	(123.19)	29.75	206.34
6	ఈక్విటీ వాటా మూలధనం రూ.10/- చొప్పున						1674.09
7	రిటైన్డ్ ఆర్జనలు						839.45
8	ఇతర ఈక్విటీ						2382.90
9	ప్రతి వాటా ఆర్జనలు (రూ.10/- ఒక్కొక్కటి) - బేసిక్	(0.38)	(0.35)	(0.01)	(0.74)	0.18	1.11
10	ప్రతి వాటా ఆర్జనలు (రూ.10/- ఒక్కొక్కటి) - డైల్యూటెడ్	(0.38)	(0.35)	(0.01)	(0.74)	0.18	1.11

సూచనలు : (1) పై ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 06.11.2024 మరియు 07.11.2024న జరిగిన వారి సంబంధిత సమావేశాల వద్ద డైరెక్టర్ల బోర్డుచే ఆమోదించబడినవి. (2) సవరించిన షెడ్యూల్‌తో నిర్ధారించ